# బలహీనత

గుర్నాధం తమ మీద మేనేజరుకి లేనిపోని చాడీలు నేర్పుగా చెప్పి, బాగా చీవాట్లు పెట్టించాడు. అటువంటి గుర్నాధంకి గుణపాఠం చెప్పాలి.... అతణ్ణి అవమానించాలి .... అదే యెలా? చెయ్యి చేసుకుంటే, మళ్ళీ ప్రమాదంలో యిరుక్కోవాల్సి వస్తుంది. అయితే, యెలా అవమానించడం? ....

ఇదే జగన్నాధం ముఠాలో వున్న మొత్తం నలుగురికీ పట్టుకున్న పెద్ద సమస్య. నలుగురి మెదడులూ యెంత చురుగ్గా, వేడిగా, వాడిగా పనిచేస్తున్నా, పరిష్కార మార్గం యే ఒక్క మెదడుకీ తట్టలేదు. సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చి పారేస్తున్నారు.

"అయిడియా వచ్చింది" అంటూ హుషారుగా అరిచాడు – యేదో గొప్ప కీలక సమస్యని సాధిస్తున్నంత గర్వంగా, జగన్నాధం.

* * *

"ఏవిట్రా అది?" అక్కడున్న ముగ్గురూ సుమారు ఒకేసారి అడిగారు ఆసక్తిగా.

"మనం యెవరిమీద దెబ్బతీయాలన్నా, మొదట అతని బలహీనత

లేవిఁటో కనిపెట్టాలి. మన గుర్నాధం బలహీనత లేవిఁటంటారు?" ఎదురు ప్రశ్న వేశాడు జగన్నాధం.

ఆ ముగ్గురూ చాలా నిరాశతో వెనక్కి జేరబడిపోయారు.

"బలహీనత లేవిఁటంటే, యెలా చెప్పడం? అతనికి డబ్బు మీద వ్యామోహం యెక్కువ." అన్నాడు, మోహన్.

"చెప్పడు మాటలు సుళువుగా వింటాడు" రంగారావు చెప్పాడు.

"సినీమాలు తెగ జూస్తాడు" విశ్వం అన్నాడు.

జగన్నాధం, మెల్లగా నవ్వేడు.... ఓ సిగరెట్టు తీసి ముట్టించాడు.

"మీ మొహం. ఇవన్నీ నిజమైన బలహీనతలు కావు."

"మరేవిఁటంటావు?"

"అలా అడగండి చెబుతా! గుర్నాధంకి మత్తు మందు తీసుకోడం, ఒక బలహీనత. బ్రాందిగాని, విస్కీగాని చూశాడా ఒళ్ళు మర్చిపోతాడు."

"ఔను, అది నాకూ తెలుసు ననుకో! అయితే, యేం చేద్దామని?" అన్నాడు మోహన్.

"ఇటువంటి ప్లాను వెయ్యాలంటే, చురుకైన మెదడుండాలిరా?"

"ఆ మెదడు నీకు వుందనే గదరా, నిన్ను నాయకుడిగా యెన్నుకున్నాం మన గ్రూపులో? ఇంతకీ, నీ ప్లాను యేమిటో చెప్పకూడదూ?" విశ్వం అన్నాడు.

"చెప్పేవరకైనా కాస్త ఆగండిరా మరి! మనం చిన్న పార్టీ యేర్పాటు చెయ్యాలి."

"ఏం పార్టీ ?"

"బుడ్డి పార్టీరా బాబు! అదీ చెప్పాలా."

"నాకు అలవాటు లేదురా!" రంగారావు కంగారుగా చెప్పాడు.

"ఫరవాలేదు లేరా! అలవాటు లేకపోతే, కాస్తంత రుచి చూద్దువుగాని .. దానికోసం పెద్దగా కంగారు పడిపోనవసరం లేదు..."

"అది సరే గాని, ఎక్కడ ఏర్పాటు చెయ్యాలని?"

"గుర్నాధం ఫామిలీ లేనట్టుందిలే! వాడింట్లోనే ఏర్పాటు చేద్దాం."

"గుర్నాథం ఒప్పుకుంటాడా? మనల్ని చూస్తేనే వాడికి మంట...."
తన సందేహాన్ని వెలిబుచ్చాడు, విశ్వం.

"అబ్బ! ఆరంభంలోనే హంసపాదేమిటి బాబూ! గుర్నాథంని ఒప్పించే బాధ్యత నా మీద వదేయండి...."

"సరే! నీ యిష్టం.... అతణ్ణి ఒప్పించే బాధ్యత నీదే! ఎట్లాగయినా గుర్నాథంని మనం అవమానించాలి. అదే మన ధ్యేయం."

"మన ధ్యేయం విజయవంతమౌతుంది.... చూస్తూ వుండండి" ధైర్యంగా చెప్పాడు. మిగిలిన ముగ్గురి మొహాలూ ప్రకాశవంతమయ్యాయ్.

*            *            *

"నమస్కారం గుర్నాథంగారు."

"నమస్కారం జగన్నాథంగారు. ఏమిటిలా విచ్చేశారు?" ఆశ్చ ర్యంగా అన్నాడు గుర్నాథం.

"అబ్బే! యేం లేదండి. మిమ్మల్ని యెప్పుడు కలుద్దామన్నా, మీరు యేదో పనిలో వుంటున్నారు. ఇవ్వాళ దొరికారు...."

"చెప్పండి."

"చలికాలం రానే వచ్చింది. మేం ఓ చిన్న విస్కీ-పార్టీ యేర్పాటు చేసుకొన్నామండి. మన మోహన్, రంగా, విశ్వం ఒకటే పోరు పెడు తున్నారు మీరు మాతోపాటు వుండాలని. సరేనని మిమ్మల్ని ఒప్పించే బాధ్యత నా నెత్తిన వేసుకున్నాను. కాదనకండి సార్." ప్రాధేయపూర్వ కంగా అన్నాడు జగన్నాథం.

ఆ మాట వినేసరికి, గుర్నాథంకి వొళ్లు పులకరించింది. విస్కీ తీసుకుని చాలా రోజులయ్యింది .. అయితే నలుగురి కంట పడకుండా వుండాలి.

"సరే నండీ, దానికేముంది మీ రింత అభిమానంతో చెబుతావుంటే, కాదంటానా. కాని ఒక్క విషయం."

"ఏమిటండీ?" ఆసక్తిగా అన్నాడు జగన్నాథం.

"ఇంకెక్కడో యెందుకు, మా ఫామిలీ లేదు కదా ప్రస్తుతం మా ఇంట్లోనే యేర్పాటు చెయ్యండి." వెదకబోయిన తీగె కాళ్ళకి తగిలినట్ల య్యింది జగన్నాథంకి.

"అంతకంటే కావల్సిందేముంది సార్, మీ యింట్లోనే ఖాయం చేస్తాను. కొన్ని గంటలు సరదాగా గడిపేయొచ్చు."

"నా వాటా డబ్బు యేమాత్రం పడుతుందో చెప్పండి యిచ్చేస్తాను" అన్నాడు గుర్నాధం.

జగన్నాధం మెల్లగా నవ్వేడు. "అమ్మమ్మ మీదగ్గర డబ్బు పుచ్చుకోవడమా? మీరు మాకు అతిథిగా వుంటారు. ఏర్పాట్లన్నీ మేం చేస్తాం లెండి. వస్తోన్న ఆదివారమే!"

"అలాగే!"

"వస్తానండీ!"

"మంచిది."

జగన్నాధం ముందుకు సాగిపోయాడు. అతని హృదయం ఆనందంతో పూగిసలాడింది. తాను యెదురుచూసే రోజు దగ్గర పడుతుందన్న సంతోషం అతణ్ణి ముందుకు నడిపించింది.

* * *

ఆ రోజు ఆదివారం ....

రాత్రి గుర్నాధం ఇంట్లో చాలా హడావిడిగా వుంది. ఏర్పాట్లన్నీ జగన్నాధం బృందమే చేస్తున్నారు. పొగడ్తలతో గుర్నాధంని ఆకాశానికెత్తారు. అతనిలాంటి మంచివాడు ఆ వూళ్ళోనే లేడన్నారు. అతనితో కాలం గడపడమే ఒక అనుభూతి—అన్నారు .... ఇలా అతణ్ణి పొంగించి, విస్కీ కాస్త ఎక్కువ డోస్‌లోనే అతనికి పోశారు. గుర్నాధం, అదంతా తన మీద అభిమానానికి చిహ్నం అనుకున్నాడు. ఏవిధమైన ఆలోచనలూ లేకుండా తాగేశాడు. దేనికయినా హద్దుండాలి కదా! డౌనైపోయాడు. కుర్చీలో వెనక్కి వాలిపోయాడు.

గుర్నాధం మత్తు మైకంలో వుండటమే జగన్నాధం బృందానికి కావల్సింది. తాము కోరుకున్న పరిస్థితికి రాంగానే వుప్పొంగిపోయారు. అంతకుముందే అనుకున్న విధంగా నలుగురూ చేతులు కలిపి, గుర్నాధం జుత్తును పరమ వికారంగా అగుపించేటట్టు కత్తిరించారు.

"అమ్మయ్య! ఇప్పటికి మన గుండెలు చల్లారాయిరా!" అన్నాడు తృప్తిగా, జగన్నాధం.

మిగిలిన ముగ్గురూ సంతోషంతో జగన్నాధాన్ని అభినందిస్తూ కరచాలనం చేశారు.

మరి కొద్దిసేపటికి గుర్నాధంకి మత్తు వదులుతున్నట్టనిపించింది.... బరువెక్కిన కళ్ళను తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంక తాము వెళ్ళిపోవడం మంచిదనుకొని లేచారు.

"వస్తాం గుర్నాధంగారూ!" అని తట్టి చెప్తూ "తలుపు గడియ వేసుకోండి ..." అన్నాడు జగన్నాధం.

వాళ్లు బయటికి వెళ్ళాక, గుర్నాధం తలుపు గడియపెట్టి, మంచం మీద ఒరిగాడు.

* * *

తెల్లవారింది. బద్దకంగా వొళ్ళు విరుచుకుని లేచాడు గుర్నాధం. తల దువ్వుకోడానికి నిలువుటద్దం ముందుకివెళ్ళి నిలబడేసరికి అసహ్యంగా కత్తిరించబడివున్న జుత్తును చూసి గతుక్కుమన్నాడు. ఇదేవిఁటి? ఇదెలా జరిగింది?.... చప్పున వెళ్ళి రాత్రి కూచున్న చోట చూశాడు. కత్తిరించబడిన జుత్తు అక్కడక్కడా అగుపించింది. నిర్ఘాంతపోయాడు. ఇప్పుడవగాహనమయ్యింది. యేం జరిగిందో! జగన్నాధం బృందం, తనని అవమానపర్చడానికే యీ పార్టీ యేర్పాటు చేసినట్టు యిట్టే గ్రహించేశాడు. వాళ్ళు చేసిన మోసానికి పళ్లు పట పట కొరికాడు. కాని యేం లాభం? వాళ్ళని ఎలా నిందించడం? అడిగితే నవ్వుతారు.... నవ్వితే, తాను మరింత కృంగిపోవాల్సి వస్తుంది. ఇంతకీ, యీ జుత్తుతో ఎట్లా బైటికి వెళ్ళడం?.... మరో ఆలోచన లేకుండా ఎప్పుడో తిరుపతిలో కొన్న టోపీ తీసి తగిలించుకుని, సెలూన్‌కి వెళ్ళి, పూర్తిగా గుండు చేయించుకున్నాడు.

టోపీ తగిలించుకొని తిరుగుతున్న గుర్నాధంని చూసి, జగన్నాధం బృందం నవ్వుకున్నారు. గుర్నాధం వొళ్ళు కుంచించుకు పోయింది. వీళ్లు ఎప్పుడైనా తన గుప్పెట్లోకి రావాలి....అప్పుడు తన తడాకా చూపిస్తా.... అనుకున్నాడు.

"నమస్కారం గుర్నాధంగారూ!" ఆ బృందం ఒక్కసారే అన్నారు...

"చాల్లెండి .... ఈ బోడి నమస్కారాలూ మీరూను...." కోపంగా అని, విసురుగా వెళ్ళిపోయాడు.

జగన్నాథం బృందం నవ్విన నవ్వులు, అతని గుండెల్లో అంకుశాలు గుచ్చుకున్నట్లుగా బాధించాయి. కాని, ఏం చేస్తాడు!

'ఏమిటి గుర్నాథంగారూ టోపీ తలిగించారు?' అని యెవరైనా అడిగితే "తిరుపతి వెళ్ళొచ్చానండీ!" అని తడుముకోకుండా చెప్పేవాడు గుర్నాథం.

ఆ రోజు నుంచీ మళ్ళీ యెవరైనా పార్టీ అని పిలిస్తే చాలు, కస్సుమనేవాడు గుర్నాథం.

* ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 16-1-1976 *